క్లుప్తంగా

నేడు పైడేటిలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

పరిగి: మండలంలోని పైడేటిలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. ఆమె ఆధ్వర్యంలో గ్రామంలో ఉదయం 6 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక పాల్గొనాలని కోరారు.

నేడు మండల పూజ


పంచముఖ ఆంజనేయస్వామి మూలవిరాట్

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం పావగడ – పెనుకొండ ప్రధాన రహదారిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా పంచముఖ ఆంజనేయస్వామి రాతి విగ్రహం ప్రతిష్టాపన చేసిన 41 రోజులైంది. ఈ నేపథ్యంలో శనివారం ఆంజనేయస్వామికి మండల పూజ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అమరాపురంలో చోరీ


బీరువాను చిందర వందర చేసిన దృశ్యం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలోని శిర రోడ్డులో నివాసం ఉంటున్న శివన్న ఇంట్లో చోరీ జరిగింది. గురువారం సాయంత్రం శివన్న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. క్షతగాత్రుడి భార్య జయలక్ష్మి కూడా పుట్టింటికి వెళ్లింది. దీన్ని గమనించిన దుండగులు గురువారం రాత్రి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలను పగులగొట్టి అందులో ఉన్న రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు జయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

శుభకార్యం


నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో వార్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: పట్టణంలోని నామా రామయ్య కల్యాణ మండపంలో శెట్టిపల్లికి చెందిన ఎంపీటీసీ జ్యోతిబాయి మరిది గిరినాయక్ వివాహ వేడుక జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ శ్యామలాబాయి, నాయకులు సాయిరాంనాయక్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: విద్యుత్‌శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మడకశిరకు వచ్చిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ప్రధానంగా కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్రంలో 26 వేలకు పైబడి కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని మంత్రికి వివరించారు. కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. నాయకులు నాగార్జున, అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటేశ్, హరిప్రసాద్ నాయక్, నరసింహమూర్తి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వెండి వస్తువుల అపహరణ

పెనుకొండ: పట్టణంలోని నారాయణమ్మ కాలనీ సమీపంలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు చంద్రమౌళి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. చంద్రమౌళి సొంత గ్రామం వెంకటగిరిపాళ్యంకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న వెండి వస్తువులను అపహరించినట్లు బాధితుడు తెలిపారు. పై అంతస్తులో బాడుగకు ఉన్న వారు చెప్పడంతో ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగిన విషయం బయట పడిందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చంద్రమౌళి తెలిపారు.

కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి

- క్వింటా రూ.1050 నుంచి రూ.600 పలుకుతున్న వైనం
- లబోదిబోమంటున్న రైతన్నలు


అగళి మండలం దొక్కలపల్లిలో ధర లేక పొలంలో నిల్వ ఉంచిన ఉల్లి గడ్డలు

అగళి: ఉల్లి పంట సాగు చేసి పండించిన రైతులకు కన్నీరే మిగిలింది. మార్కెట్లో ధర పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఉల్లి పంటను విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి గిట్టుబాటు అవడం లేదని వాపోతున్నారు. పంట చేతికొచ్చే సమయంలోనే ఉల్లిగడ్డ ధర పడిపోతుందని, నిల్వ చేసుకుందామంటే పాడైపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి పూర్తిగా తగ్గినా..

ప్రస్తుతం ఉల్లి దిగుబడి పూర్తిగా తగ్గిపోయినా ధర మాత్రం రోజు రోజుకు పతనం కావడంపై రైతులు గగ్గోలు పెడుతున్నారు. వాస్తవంగా సప్లయ్ తగ్గినప్పుడు ధర పెరగాలి. అయితే సప్లయ్ లేకపోయినా మార్కెట్‌లో ఉల్లి ధర తగ్గుతోంది. క్వింటా ఉల్లికి గరిష్టంగా కేవలం రూ.1050 , మధ్యస్థ ధర రూ.750, కనిష్ట ధర రూ.600 మాత్రమే దక్కుతుండటంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము ఉల్లి పంటను సాగు చేయలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

440 ఎకరాల్లో సాగు

మడకశిర నియోజకవర్గంలో 440 ఎకరాల్లో ఉల్లి పంట సాగులో ఉంది. అగళి మండలంలో 80 ఎకరాలు , రొళ్ల మండలంలో 85 , గుడిబండ మండలంలో 75 , అమరాపురంలో 90 , మడకశిర మండలంలో 110 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు.

ఆశించిన ధర లేదు

ఉల్లి సాగు చేయడనికి పెట్టుబడి పెరుగుతోంది. మందులు, కూలీల ఖర్చులు అధికంగా అవుతున్నాయి. క్వింటా ఉల్లిగడ్డల ధర రూ.1500 నుంచి 1600 పలికితే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం ఉల్లి ధరలు పడిపోవడంతో తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నాము. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలి.
– గోవిందప్ప, రైతు, దొక్కలపల్లి, అగళి మండలం

గత ప్రభుత్వ హయాంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం

మడకశిరరూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. అప్పటి విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రైతులు లోఓల్టేజ్‌తో ఇబ్బంది పడకుడదని మండలంలోని వైబీ హళ్లి, కదిరేపల్లి క్రాస్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ల మంజూరు చేశారన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా అప్పటిలో ప్రారంభించలేదన్నారు. ఇప్పడు రాష్ట్ర మంత్రులు తమ హయాంలోనే వాటిని నిర్మించినట్లుగా వచ్చి ప్రారంభోత్సవాలు చేస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం మడకశిర ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

అగళి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మండలంలోని రామనపల్లి, ఇనగలూరు గ్రామానికి విద్యుత్ ఉపకేంద్రం మంజూరు చేసి రూ.4 కోట్లతో నిర్మించారని వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరీష్ గౌడ్, సర్పంచ్ మంజుల నాటరాజు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను అప్పట్లో ప్రారంభించలేదని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం తామే దాన్ని నిర్మించినట్లు ఆర్భాటంగా ప్రారంభిస్తుండటం సిగ్గుచేటని విమర్శించారు.



జార్జిరెడ్డికి ఘన నివాళి


జార్జిరెడ్డికి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని సువర్ణ భారతి కళాశాలలో కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా విద్యారంగ సమస్యలు, విద్యార్థుల హక్కులకై పోరాడిన విద్యార్థి నాయకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి అన్నారు. ఆయన ఏ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాడో వారే నేడు పాలకులుగా మారి దేశంలో అరాచక పాలన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నాగేంద్ర, రాజ, మహేష్, హర్ష కుమార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాకు సిద్ధంగా ఉండండి

- గోవులు చనిపోయాయని టీటీడీ ఛైర్మనే ప్రకటించారు
- ఆ విషయం తెలియకుండా సవాలు చేస్తారా?
- ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ధ్వజం



మడకశిర: తిరుమల గోశాలలో గోవులు మృతి చెందలేదని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చెప్పడం చాలా హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాక్షాత్తు టీటీడీ ఛైర్మన్ 191 గోవులు మృతి చెందినట్లు ప్రకటించారని పేర్కొన్నారు. పచ్చమీడియాలో కూడా ఈవార్త వచ్చిందన్నారు. ఈ విషయం టీటీడీ బోర్డు మెంబర్ ఎంఎస్ రాజుకు తెలియకపోవడం దురదృష్టకరమని తెలిపారు. గోశాలలో గోవులు మృతి చెందినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ పదవులకు రాజీనామా చేస్తానని సవాల్ విసిరావని, ఆ సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. గోవులు మృతి చెందిన విషయాన్ని తాను నిరూపిస్తానని స్పష్టం చేశారు. పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమలలో జరగరాని ఘటనలు జరుగుతున్నాయన్నారు. భక్తుల మనోభావాలను పాలకులు దెబ్బతీస్తున్నారని విమర్శించారు. వెంటనే తిరుమల పవిత్రతను కాపాడడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో నలుగురు రాష్ట్ర మంత్రులు శుక్రవారం ఒకేసారి పర్యటించినా మడకశిర ప్రాంతానికి ఎలాంటి ఉపయోగంలేదని విమర్శించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తన ఉనికిని కాపాడుకోవడానికే మంత్రులను రప్పించారన్నారు. మంత్రుల పర్యటన ప్రజలకు ఉపయోగపడకపోయినా ఎమ్మెల్యేకి మాత్రం బాగా ఉపయోగపడిందని ఎద్దేవా చేశారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ


కేకే పాళ్యం భూమి పూజలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే

గుడిబండ: మండల పరిధిలోని కేకే పాళ్యం గ్రామ సమీపంలో శుక్రవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు.

రొళ్ల: మండల పరిధిలోని రంగనపల్లిలోని చింతతోపులో రూ.3.50 కోట్ల వ్యయంతో 33 కేవీఏ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సర్పంచ్ అనిత అధ్యక్షతన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సవిత, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

అగళి: మండల కేంద్రంలోని ఇనగలూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రులు రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు.

అమరాపురం: మండల పరిధిలోని పి.శివరం గ్రామంలో నూతనంగా రూ.4 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రులు రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సవిత, ఎంపీ. పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం


రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హిందూపురం టౌన్: భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి అధ్యక్షతన నేషనల్ హెరాల్డ్ స్కాంపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశభక్తుల ముసుగులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వారి కుటుంబ సభ్యులు, నాయకులు దేశాన్ని దోచుకున్నారన్నారు. నేషనల్ హెరాల్డ్ స్కాం ద్వారా రూ.2 వేల కోట్లు మనీలాండరింగ్ ద్వారా దారి మళ్లించారన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు, స్కాముల రాజకీయాలు మానకపోతే భవిష్యత్తులో ఎక్కడా ఒక్క సీటు కూడా గెలవలేరని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు అంజలి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


హిందూపురం: ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్

హిందూపురం అర్బన్: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్ శుక్రవారం తూమకుంట పారిశ్రామికవాడలో ఎక్సెల్ రబ్బర్ పరిశ్రమలో కార్మికులకు, సెక్యూరిటీ సిబ్బందికి పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి మెలకువలు పాటించి రక్షణ పొందడం, ఆస్తి నష్టాన్ని ఎలా కాపాడుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. పనిచేసే ప్రదేశంలో తక్షణం పొగలు కమ్ముకొనే సమయంలో ఎలా కార్మికులు బయట పడాలన్నది ప్రాక్టికల్‌గా చూపి వివరించారు. కార్మికులకు ప్రమాదాల నివారణపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ కంపెనీ మేనేజర్ శ్రీధర్, హెచ్‌ఆర్ రవీంద్రరెడ్డి, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లిలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్యాస్ ద్వారా ఏర్పడే అగ్నిప్రమాదాలపై ప్రత్యేకంగా మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కియా ఫైర్ అగ్నిమాపక సిబ్బంది వెంకటేష్, రియాజ్, ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

165 చెరువులను ఎలా నింపుతారు?

మడకశిర: నియోజకవర్గానికి సకాలంలో కృష్ణా జలాలు అందించకుండా కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని వైఎస్సార్‌సీపీ కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు. గత సెప్టెంబర్‌లోనే మడకశిరకు కృష్ణా జలాలను వదలాల్సి ఉందన్నారు. హంద్రీనీవా కాలువలు సరిగా లేవని కుంటిసాకులు చెప్పి కృష్ణా జలాలను వదలడంలో తీవ్ర జాప్యం చేశారన్నారు. పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లోని 265 చెరువులకు గత సెప్టెంబర్‌లోనే సాగునీరు వదలాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం జీడిపల్లి, గొల్లపల్లి రిజర్వాయర్లకు పై నుంచి నీరు రావడం లేదన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 200 క్యూసెక్కుల నీరు మాత్రమే ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో మడకశిర నియోజకవర్గానికి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలోని 165 చెరువులను 100 క్యూసెక్కుల నీటితో నింపడం సాధ్యమా? అని ప్రశ్నించారు. మడకశిర నియోజకవర్గంలో అన్ని చెరువులు పూర్తిస్థాయిలో నిండాలంటే 3 టీఎంసీల నీరు అవసరమన్నారు. టీఎంసీ నీరు కూడా మడకశిరకు వచ్చిన దాఖలాలు లేవని, కూటమి నాయకులు రైతులను మభ్య పెట్టకుండా నీటి విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.

రెగ్యులర్ చేయాలని వినతి

మడకశిరరూరల్: ఎంటీఎస్, 98 డీఎస్సీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేసినట్లు 98 డీఎస్సీ ఉపాధ్యాయుడు వెంకటచంద్రాచారి పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయస్సును 62కు పెంచాలి తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించామని తెలిపారు. న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

వక్ఫ్ సవరణ పుస్తకాల పంపిణీ


వక్ఫ్ సవరణ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని పలు మసీదుల వద్ద శుక్రవారం ముస్లిం జేఏసీ నాయకులు వక్ఫ్ సవరణ పుస్తకాలను పంపిణీ చేశారు. ముస్లిం వక్ఫ్ సవరణ బిల్లుకు సంబంధించి ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో నమాజ్ అనంతరం జేఏసీ నాయకులు అన్ని మసీదుల వద్దకు వెళ్లి సంచికలను అందజేశారు.

తాగునీటి కోసం నిరసన


రాస్తారోకో చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో నెలకొన్ని తాగునీటి ఎద్దడి తీర్చాలంటూ కాలనీ వాసులు శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కొద్ది రోజులుగా తాగునీరు అందక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. సమస్యకు పరిష్కారం చూపాలని కమిషనర్ సతీష్ కుమార్‌ను వేడుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులతో పాటు సీపీఐ నాయకులు శ్రీరాములు, రమేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ నాయకులు శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం వద్ద రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీరాములు, రమేష్ మాట్లాడుతూ తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పలుమార్లు నగర పంచాయతీ కార్యాలయంలో అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ఆఖరికి సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

కొల్హాపురి మహాలక్ష్మీ నమోస్తుతే


అలంకరణలో మహాలక్ష్మీదేవి


పాలబావి వద్ద గంగ పూజ చేస్తున్న మహిళలు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అప్పేపల్లి, కాకి, దొమ్మరహట్టి గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని ఉదయాన్నే ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు కానుక రూపంలో సమర్పించిన పట్టువస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో పాటు పూలు, గంధంతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. ఆలయ ఆవరణలో పోతులరాజు చేపట్టిన నృత్యాన్ని చూపర్లను ఆకట్టుకుంది. పాలబావి వద్ద పెద్ద ఎత్తున మహిళలు గంగ పూజ చేశారు.

శ్రీహరి కోటను సందర్శించిన విద్యార్థులు


పరిశోధన కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు క్యావ, చరణ్‌తో పాటు జీవశాస్త్రం ఉపాధ్యాయుడు ప్రసాద్ నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటను సందర్శించినట్లు హెచ్‌ఎం రంగస్వామి తెలిపారు. విజ్ఞాన యాత్రలో భాగంగా నీలకంఠాపురం పాఠశాల నుంచి క్యావ, చరణ్ అనే విద్యార్థులు వెళ్లినట్లు పేర్కొన్నారు. గురువారం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుడు శ్రీహరికోట షార్ అంతరిక్ష పరిశోధన కేంద్రానికి వెళ్లి అక్కడి శాస్త్రవేత్తలను కలిసి శాస్త్ర సాంకేతిక అంశాల గురించి తెలుసుకున్నారన్నారు. జిల్లా నుంచి 82 మంది విద్యార్థులు, 23 మంది ఉపాధ్యాయులు శ్రీహరికోటలో అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని సందర్శించారని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మడకశిరరూరల్: రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ శుక్రవారం మడకశిరకు విచ్చేసిన సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. 14 ప్రధాన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలేం రామాంజినేయులు, మడకశిర తాలుకా అధ్యక్షుడు నటరాజ్, డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


హిందూపురం: సీఎండ్ఐజీ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ స్టీఫెన్‌రాజ్


పావగడ జీప్పీ చర్చ్‌లో శుభ శుక్రవారం ప్రార్థనలు జరుగుతున్న దృశ్యం

● భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

సాక్షిబృందం: త్యాగం, అవధులులేని క్షమాగుణం, విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన ఏసుక్రీస్తు శిలువను మోసి తన రక్తాన్ని చిందించి పాపులను పరిశుద్ధులుగా చేశారని పాసర్లు అన్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని చర్చీల్లో శుభ శుక్రవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు పుట్టినప్పటి నుంచి ఆయన ప్రాణాన్ని త్యాగం చేసే దాకా జరిగిన విషయాలన్నింటినీ పాస్టర్లు వివరించారు. అనంతరం ఆయా చర్చీల్లో మజ్జిగ, అల్పాహారాన్ని అందజేశారు.


అమరాపురం: ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రకాష్‌రావు


పెనుకొండ: నాగలూరు బైబిల్ మిషన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

అందరి కృషితోనే పావగడకు తుంగభద్ర నీరు


మాట్లాడుతున్న శివప్రసాద్

పావగడ: తాలూకా వ్యాప్తంగా పలు సంఘ సంస్థలు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతు సంఘం నాయకుల కృషితోనే పావగడకు తుంగభద్ర నీరు అందుతోందని పావగడ సమగ్ర నీరావరి పోరాట సమితి అధ్యక్షుడు శివ ప్రసాద్ తెలిపారు. జల సాధనకు పాటుపడిన సుమారు 200 మంది ఉద్యమ కారులను ఈ నెల 21న సోమవారం ఉదయం ఎస్‌ఎస్‌కే రంగ మందిరంలో ఘనంగా సన్మానించి సత్కరిస్తున్నామన్నారు. స్థానిక అతిథి గృహంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సంస్థల పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారుల సన్మాన కార్యక్రమానికి ప్రజలందరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సొగడు వెంకటేష్, పూజారప్ప, నరసింహారెడ్డి, రాజశేఖర్, శివకుమార్ సాకేల్ తదితరులు పాల్గొన్నారు.